

చి'వరి'కి దొంగ దెబ్బ

వరి పంట మరో పది రోజుల్లో చేతికి అందుతుందని ఆశపడిన రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ దొంగలతో అవస్థలు తప్పడంలేదు.

- 8లో ▸



పల్లెపల్లెకు ఓబీసీ..

పల్లెపల్లెకు ఓబీసీ.. ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని ఈ నెల 6 నుంచి నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తెలిపారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.7 /25.9

వాతావరణం

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.



ఇఫ్తార్ బుధ : 6:35 | సహర్ గురు : 4:44

రంజాన్ వేళలు

ఎండ ప్రచండం..



నగరంలో గొడుగు పట్టుకుని నడుచుకుంటూ వెళ్తున్న యువతి



ఇందూరుపై భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. వారం రోజులుగా ఎండ తీవ్రత బాగా పెరిగింది. మంగళవారం 37 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో ప్రజలు అల్లాడుతున్నారు. ఇంటి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో జాగ్రత్తలు తీసుకొని రోడ్లపైకి వస్తున్నారు. గొడుగులు, టోపీలు, టవల్స్, మాస్కులు వేసుకొని, కూలింగ్ గ్లాసులు పెట్టుకొని ప్రయాణిస్తున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



ఎండ నుంచి రక్షణగా టోపీలు పెట్టుకుని బైకుపై వెళ్తూ..



స్కార్ఫ్‌లు ధరించి వెళ్తున్న యువతులు



31వ తేదీ	1వ తేదీ	2వ తేదీ	3వ తేదీ
37.5 డిగ్రీలు	37.1 డిగ్రీలు	36.4 డిగ్రీలు	37.7 డిగ్రీలు

న్యూస్‌రీల్

హనుమాన్ శోభాయాత్ర రూట్ మ్యాప్ పరిశీలన



ఖలీల్‌వాడి: నగరంలో జరిగే హనుమాన్ శోభాయాత్ర రూట్‌మ్యాప్‌ను ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. అంతకు ముందు ఏసీపీలు, సీఐలతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి సీపీ మాట్లాడుతూ నగరంలో హనుమాన్ శోభాయాత్ర కోసం నాలుగున్నర కిలోమీటర్ల పరిధిలో 600 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 1500 మంది పోలీసుల సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్నిచోట్ల వీడియోగ్రఫీ, డ్రోన్ కెమెరాలతో పటిష్టమైన నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శోభాయాత్ర కంఠేశ్వర్ నుంచి ప్రారంభమై గోల్‌హనుమాన్ వద్ద పూర్తవుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ(ఏఆర్) గిరిరాజు, పరిపాలన అధికారి (అడ్మిన్) ఏసీపీ మధుసూధర్ రావు, ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో..



బోధన్‌టౌన్: హనుమాన్ జయంతి సందర్భంగా బోధన్‌లో నిర్వహించే వీర హనుమాన్ శోభాయాత్ర రూట్‌ను ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించారు. హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమయ్యే శోభాయాత్రకు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరైనా సహించేది లేదని హెచ్చరించారు.

ప్రభుత్వ భూములను ప్రజలకే పంచాలి



నిజామాబాద్ సిటీ: ఎక్కడైతే ప్రభుత్వ భూములు ఉన్నాయో వాటిని నిరుపేద ప్రజలకే పంపిణీ చేయాలని మాజీ ఎమ్మెల్సీ, రూరల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి భూపతిరెడ్డి డిమాండ్ చేశారు. నిజామాబాద్ మండలం మల్కాపూర్(ఏ) గ్రామశివారు సర్వేనం 339లో గల 360 ఎకరాల ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలని గత 14 రోజుల నుండి గ్రామస్తులు ధర్నా చేస్తున్నారు. ఈ ధర్నా శిబిరాన్ని మంగళవారం భూపతిరెడ్డి సందర్శించి, వారికి మద్దతు తెలిపారు. గ్రామస్తులు 20 సంవత్సరాలుగా సాగుచేసిన భూములను వారికే కేటాయించాలని, ప్రభుత్వ స్థలాన్ని ఇల్లు లేని పేదలకు పంపిణీ చేయాలన్నారు. నిజామాబాద్ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, డీసీసీ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ఎల్లయ్య, కొర్వ రాజేంద్రప్రసాద్, రమేష్, శీనన్న, రాజలింగం, అనిల్‌రెడ్డి, శ్రీను, లింగం, శ్రీనివాస్, మహేందర్, సుదర్శన్ రెడ్డి, రూప్‌సింగ్, నరేష్, హకీల్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పత్తాలేని మిత్తి!

- నెల క్రితం ప్రకటన చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాకు రూ. 71.96 కోట్ల వడ్డీ విడుదల
- ఇంత వరకు మహిళా సంఘాల ఖాతాల్లో జమకాని వైనం
- బ్యాంకర్లు, సెర్ప్ అధికారుల మధ్య సమన్వయ లోపం
- మిత్తి లెక్కలపై కరువైన స్పష్టత



సమావేశమైన ఎస్‌హెచ్‌జీ మహిళలు (ఫైల్)

ఇందూరు(నిజామాబాద్ అర్బన్) : మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు విడుదల చేసిన వడ్డీ పత్తా లేకుండా పోయింది. ప్రకటన చేసి నెల రోజులు కావస్తున్నా డబ్బులు ఇంత వరకు ఎస్‌హెచ్‌జీల ఖాతాల్లో జమ కాలేదు. దీంతో జిల్లాకు మంజూరైన రూ. 71.96 కోట్లు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఇంతకు ప్రభుత్వం మంజూరు చేసిందా..? అనే అనుమానం కలుగుతోంది. మహిళా సంఘాలు బ్యాంకు లింకేజీ పథకం ద్వారా రుణాలు పొందుతున్నాయి. మహిళలు వారు తీసుకున్న రుణాలకు వడ్డీతో కలిపి ప్రతినెలా కిస్తీలను తిరిగి బ్యాంకులకు కడుతున్నారు. అయితే, మహిళలు కట్టిన మిత్తిని ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకోసారి వారికే వాపస్ చేయాల్సి ఉంది. కానీ, కొన్నేళ్లుగా బకాయి పెడుతోంది. జిల్లాకు 2018–19 సంవత్సరం నుంచి ప్రస్తుత ఏడాది వరకు మొత్తం నాలుగేళ్ల వడ్డీ రూ. 188 కోట్లు రావాల్సి ఉంది. ప్రభుత్వం గత నెల 8న మహిళా దినోత్సవం కానుకగా మొత్తం కాకుండా కొంత వడ్డీని విడుదల చేస్తున్నట్లు ప్రకటన చేసింది. ఇందుకు జిల్లాకు 2018–19 సంవత్సరానికి సంబంధించిన జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలు కలిపి రూ. 11.68 కోట్లు, అలాగే 2019–20 సంవత్సరానికి రూ. 60.28 కోట్లు విడుదల చేస్తున్నట్లు చెప్పింది. ఈ డబ్బులు 20,582 మహిళా సంఘాల బ్యాంకు ఖాతాల్లో వెంటనే జమ చేస్తామని కూడా ప్రభుత్వం పేర్కొంది. దీంతో సంఘాల్లోని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. కానీ, నేటి వరకు మిత్తి డబ్బులు ఖాతాల్లో పడలేదు. ఎప్పటిలాగే వీరికి ఎదురుచూపులు తప్పడం లేదు.

ఇంకా రూ. 216 కోట్లు బకాయిలు!

నెల క్రితం విడుదల చేసిన కొంతమేర వడ్డీ డబ్బులే జమకాని పరిస్థితి ఉంటే, మిగిలిన బకాయిలను కూడా ఇస్తామని ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. బ్యాంకు లింకేజీ రుణాలకు సంబంధించిన వడ్డీ ఇంకా రూ. 116 కోట్లు రావాల్సి ఉండగా, స్త్రీనిధి లోన్లకు సంబంధించిన రూ. 100 కోట్ల వరకు వడ్డీని ప్రభుత్వం బకాయి పడింది. మొత్తం జిల్లాకు ఇంకా రూ. 216 కోట్ల దాకా వడ్డీ వాపస్ రావాల్సి ఉంది. ఇవి ఎన్ని విడతల్లో ఇస్తుందో, ఎన్ని రకాల నిబంధనలు పెడుతుందో తెలియదు.

ఎవరికీ స్పష్టత లేదు..

ఒకటి, రెండు నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు మహిళా సంఘాలకు వడ్డీ పంపకాలు చేశారు. ప్రొసీడింగ్‌లు ఇచ్చి రోజులు గడుస్తున్నా డబ్బుల జాడలేదు. అయితే, రాష్ట్ర సెర్ప్ అధికారులు మిత్తి డబ్బులను జిల్లాకు విడుదల చేశామని, బ్యాంకుల్లో పడ్డాయని పేర్కొంటున్నారు. కానీ, జిల్లా అధికారులు బ్యాంకర్లను ఆరా తీస్తే ఇంకా రాలేదని చెబుతున్నారు. మార్చి లెక్కల్లో బిజీగా ఉన్నామని మరికొందరు బ్యాంకర్లు తప్పించుకుంటున్నారు. అధికారులు, బ్యాంకర్ల మధ్య సమన్వయం లేదని తెలుస్తోంది. దీంతో వడ్డీ డబ్బుల విషయంలో స్పష్టత లేకుండా పోయింది. పలు చోట్ల బ్యాంకర్లు బకాయిల కింద జమ చేసుకుంటున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

పరిశీలిస్తున్నాం..



జిల్లాకు విడుదలపై వడ్డీ డబ్బులు బ్యాంకులకు చేరినట్లుగా రాష్ట్ర సెర్ప్ అధికారులు చెబుతున్నారు. బ్యాంకర్లను అడిగితే స్పష్టత ఇవ్వడం లేదు. మహి ళా సంఘాల ఖాతాల్లో డబ్బులు పడ్డాయో లేదో వీలైనంత త్వరగా బ్యాంకర్ల ద్వారా తెలుసుకుంటాం. ఎస్‌హెచ్‌జీలకు జమయ్యేలా చూస్తాం.

– చందర్ నాయక్, డీఆర్‌డీవో, నిజామాబాద్

వెల్‌నెస్ సెంటర్ మార్చాలి



ఖలీల్‌వాడి: ఎంప్లాయిస్, పెన్షనర్ల, జర్నలిస్టుల వెల్‌నెస్ సెంటర్‌ను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నుంచి మార్చాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. ఈమేరకు వా రు మంగళవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు వినతి పత్రం అందజేశారు. సభ్యులు సాయి లు, గంగాకిషన్, ప్రసాద్, లింగయ్య, రంగయ్య పాల్గొన్నారు.

పరిశోధనా ఫలితం!

- అధిక కుర్కుమిన్ కలిగిన విత్తనాల అభివృద్ధి
- నాబార్డు సహకారంతో విత్తనోత్పత్తి లక్ష్యం పూర్తి
- రెండేళ్లలో 32 టన్నులను రైతులకు అందించిన కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన స్థానం



రైతులకు విత్తనాలను అందజేస్తున్న శాస్త్రవేత్తలు



ఏసీసీ నం.48 రకం విత్తనం

కమ్మర్‌పల్లి : నూతన వంగడాల అభివృద్ధి, నాణ్యమైన, అధిక దిగుబడి, అధిక కుర్కుమిన్ కలిగిన విత్తనాలను అందించాలనే లక్ష్యంతో కమ్మర్‌పల్లిలో ఏర్పాటైన పసుపు పరిశోధన కేంద్రంలో శాస్త్రవేత్తల పరిశోధనలు ఫలితాలనిస్తున్నాయి. పరిశోధనలో భాగంగా అధిక కుర్కుమిన్ కలిగిన విత్తనాలను అభివృద్ధి చేసి ఫలితాలను సాధించారు. తెలంగాణలో అధికంగా తక్కువ శాతం కుర్కుమిన్ కలిగిన పసుపు రకాలనే సాగు చేస్తున్నారు. ఈ రకాల్లో 2.5–3.5 శాతం మాత్రమే కుర్కుమిన్ ఉంటుంది. 4.5 శాతం కంటే ఎక్కువ కుర్కుమిన్ కలిగిన పసుపు విత్తన రకాలను రైతులకు అందించాలనే ఉద్దేశంతో పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు సంకల్పించారు. మూడేళ్ల క్రితం నాబార్డు సహకారంతో పరిశోధనలు ప్రారంభించారు. 50 టన్నుల విత్తనాలను రైతులకు అందించాలనే లక్ష్యంతో ఐదెకరాల విస్తీర్ణంలో ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చిన విత్తనాలను సాగు చేశారు. కేరళ రాష్ట్రం నుంచి ఏసీసీ నం.48 (ప్రగతి), ఏసీసీ నం.79, బీ హార్ నుంచి రాజేంద్ర సోనియా, రాజేంద్ర సోనాలి, మహారాష్ట్ర నుంచి రాజాపురి, తమిళనాడు నుంచి బీఎస్‌ఆర్ 2, పితాంబర్ వంటి అధిక కుర్కుమిన్ ఉన్న విత్తన రకాలను తీసుకువచ్చి పరిశోధనలతో అభివృద్ధి చేసి ఫలితాలను సాధించారు.

అదేవిధంగా కమ్మర్‌పల్లి పరిశోధన స్థానంలో సృష్టించిన దుగ్గిరాల ఎరుపు రకంను కూడా అభివృద్ధి చేశారు. రెండేళ్లలో 32 టన్నుల పసుపు విత్తనాన్ని రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా రైతులకు అందించారు. ఈయేడు 18 టన్నుల విత్తనం ఉత్పత్తి కాగా, రైతులకు పంపిణీ చేయడం కోసం పరిశోధన కేంద్రంలో సిద్ధంగా ఉంది. ఇంకా అధిక కుర్కుమిన్ కలిగిన, ది గుబడి ఇచ్చే 24 రకాల విత్తనాలపై పరిశోధనలు సాగుతున్నాయి.

అధిక కుర్కుమిన్ కలిగిన రకాలనే సాగు చేయాలి



పసుపు సాగు చేసే రైతులు అధిక కుర్కుమిన్ కలిగిన విత్తన రకాలనే వేయాలి. దీనివల్ల రాష్ట్రంలో పసుపు ఆధారిత పరిశ్రమలు వచ్చే అవకాశం ఉంటుంది. అధిక కుర్కుమిన్ కలిగిన రకాలను అభివృద్ధి చేసి రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్నాం. విత్తనాలు కావాలనుకునే రైతులు పరిశోధన స్థానంలో సంప్రదించాలి.

– మహేందర్, ప్రధాన శాస్త్రవేత్త, పసుపు పరిశోధన స్థానం, కమ్మర్‌పల్లి

దిద్దుబాటు చర్యలు..

- పదోతరగతి పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు
- వీసీలో అధికారులకు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశాలు



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

నిజామాబాద్‌అర్బన్/ఖలీల్‌వాడి: రాష్ట్ర వ్యాప్తంగా సంచలం రేపుతున్న పదో తరగతి పేపర్ల లీకేజీ ఘటనపై విమర్శలు తీవ్రమవడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో అన్ని పరీక్ష కేంద్రాల వద్ద గట్టి నిఘా ఉంచాలని ఆదేశాలు జారీ అయ్యాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం జిల్లాల కలెక్టర్లు పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి వార్షిక పరీక్షలను మరింత పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఒకరిద్దరి నిర్లక్ష్య వైఖరితో సోమ, మంగళ వారాల్లో అక్కడక్కడా చోటు చేసుకున్న ఘటనలు ఎంతో బాధ కలిగించాయన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీలు జరగకపోయినా, రాజకీయం కోసం కొంతమంది లీకేజీలు జరిగినట్లు మాట్లాడుతున్నారని, ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని మంత్రి ఆవేదన వెలిబుచ్చారు. మిగిలిన పరీక్షలను మరింత కట్టుదిట్టమైన ఏర్పాట్లతో పక్కాగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లతో ఎవరైనా సరే అనుమతించకూడదన్నారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోపాలు, లీకేజీలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, ప్రత్యేక బృందాలను వీలైనంతవరకు ఎక్కువ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయాలని సూచించారు.

జిల్లాలో 138 పరీక్ష కేంద్రాలు

జిల్లాలో 138 పరీక్షా కేంద్రాలు ఉండగా.. వీటిలో ఒక్కో కేంద్రం వద్ద ప్రస్తుతం ఒక కానిస్టేబుల్ మాత్రమే విధుల్లో ఉన్నారు. ఇక నుంచి ఒక్కో పరీక్ష కేంద్రం వద్ద ఇద్దరు కానిస్టేబుళ్లను భద్రతగా ఉంచనున్నారు. సెంటర్ వద్ద 144 సెక్షన్ పక్కగా అమలు చేయాలని ఆదేశాలందాయి. పరీక్ష కేంద్రానికి సమీపంలో అనుమానితులను, బయట వ్యక్తులను అనుమతించవద్దని కఠిన ఆదేశాలు జారీ అయ్యాయి.

మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ..

మంగళవారం జరిగిన హిందీ పరీక్షలో డిచ్‌పల్లి మండలం ధర్మారంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఒక విద్యార్థి కాపీయింగ్‌కు పాల్పడగా ప్రత్యేక తనిఖీ బృందం పట్టుకుని డిబార్ చేశారు. అనంతరం విద్యార్థిపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేశారు. ఇన్విజిలేటర్‌ను సస్పెన్షన్ చేశారు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

21,558 మంది హాజరు

జిల్లాలో మంగళవారం జరిగిన హిందీ పరీక్షలో 21,625 మంది విద్యార్థులకు గాను 21,558 మంది పరీక్ష రాశారు. 67 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. డీఈవో దుర్గాప్రసాద్ తొమ్మిది పరీక్ష కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 44 సెంటర్లు, అబ్జర్వర్లు 6 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

పరీక్షల నిర్వహణలో జాగ్రత్తగా ఉండాలి

విద్యాశాఖ మంత్రి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులకు కీలక సూచనలు చేశారు. పరీక్షల నిర్వహణలో ఎంతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు సైతం పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అదనపు డీసీపీ మధుసూదన్ రావు, డీఈవో దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరికోతలు ముమ్మరం

- రైతులకు వాన భయం
- రాత్రింబవళ్లు పని చేస్తున్న కోత యంత్రాలు



పల్లికొండలో ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు



వరిని కోస్తున్న కోత యంత్రం

ఇందూరు(నిజామాబాద్ అర్బన్) : రైతులకు వాన భయం పట్టుకుంది. రానున్న ఐదు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో వరికోతలను వేగవంతం చేశారు. చేతికొచ్చిన పంట ఎక్కడ దెబ్బతింటుందోననే భయంతో పచ్చి పంటను సైతం కోసేసి ధాన్యాన్ని కల్లాలకు తరలిస్తున్నారు. మరోవైపు కోత యంత్రాలకు డిమాండ్ పెరిగింది. దీంతో రాత్రింబవళ్లు యంత్రాలను నడిపిస్తున్నారు. కాగా వ్యవసాయ శాఖ వేసిన అంచనా కంటే యాసంగి సాగు గణనీయంగా పెరిగింది. నాలుగు లక్షల ఎకరాలకు పైగా వరిని రైతులు సాగు చేశారు. అకాల వర్షాలు రానున్నాయనే భయానికి రైతులంతా ఒకేసారి కోతలు ప్రారంభించారు. తద్వారా కల్లాలకు భారీ ఎత్తున ధాన్యం వస్తోంది. ధాన్యం ఆరబోయడానికి స్థలాలు కూడా దొరకడం లేదు. వడ్లు తడవకుండా కుప్పలపై ముందు జాగ్రత్తగా టార్పాలిన్లు కప్పి ఉంచారు. మరోవైపు జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఇంకా ఏర్పాటు చేయకపోవడంతో రైతులు పచ్చి ధాన్యాన్నే వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

క్లుప్తంగా

7న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 7న శుక్రవారం ఉదయం 7 గంటలకే స్థానిక ఇందిరా గాంధీ స్టేడియంలో జిల్లాస్థాయి ఫెడరేషన్ అండర్-20 మెన్, ఉమెన్ అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు అథ్లెటిక్స్ డ్రెస్ కోడ్ పాటించాలన్నారు. క్రీడాకారులు తప్పనిసరిగా వయస్సు ధ్రువీకరణ కోసం ఎస్సెస్సీ మార్కుల జాబితా లేదా, బోనాఫైడ్ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు.

రేపు ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్

నిజామాబాద్ సిటీ : ఏఎన్‌ఎం, ఎంపీహెచ్‌ఏ (ఎఫ్) ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు గురువారం తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో హాజరు కావాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుదర్శనం మంగళవారం ప్రకటనలో తెలిపారు.

సాఫ్ట్‌బాల్ టోర్నీలో మిట్టాపల్లి క్రీడాకారుల ప్రతిభ



డిచ్‌పల్లి : ఈనెల 2న సుద్దపల్లి గురుకుల పాఠశాలలో జరిగిన మినీ సబ్ జూనియర్ జిల్లా సాఫ్ట్ బాల్ టోర్నీలో మిట్టపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని సాధించారు. ఫైనల్‌లో ఆర్మూర్ గురుకుల పాఠశాల జట్టుతో హోరాహోరీగా పోరాడి 05-06 తేడాతో ఓటమిపాలై ద్వితీయస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, పీడీ మర్కంటి గంగా మోహన్‌ను సర్పంచ్ తేలు గణేష్, ఎంపీటీసీ బాలగంగాధర్, మిట్టాపల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం రాఘవేంద్రరావు, పాఠశాల చైర్మన్ భాస్కర్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం విజేత, టీఆర్‌ఎస్ నాయకులు ఒడ్డం నరసయ్య, గోపు రాజేశ్వర్, ఎస్.కె జుబేర్, ఉపాధ్యాయులు శ్రీకాంత్, మమత , రమాదేవి అభినందించారు.

ఇఫ్తార్‌లో స్పీకర్ పోచారం



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని దుర్కిలో రంజాన్ ఉపవాసాలను పురస్కరించుకుని మైనారిటీలు నిర్వహించిన ఇఫ్తార్ విందులో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన వెంట ఎంపీపీ పాల్త్య విఠల్, బాన్సువాడ నియోజక వర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి, సర్పంచ్ శ్యామల, పీఏసీఎస్ చైర్మన్ డి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ కిషోర్ యాదవ్, జిల్లా కో ఆప్షన్ మెంబర్ మాజీద్ ఖాన్, నాయకులు గడుగు శంకర్ తదితరులున్నారు.

చి‘వరి’కి దొంగ దెబ్బ..!

- చోరీకి గురవుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు
- ఎండిపోయే స్థితిలో వరి
- పదిరోజుల వరకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వని అధికారులు
- ఆందోళనలో అన్నదాత



వెల్కటూర్ శివారులో దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

బాల్కొండ: మెండోరా మండలం వెల్కటూర్ శివారులో సాగుచేసిన వరిపంట మరో పదిరోజుల్లో చేతికందుతుందని ఆశపడ్డ రైతులపై ట్రాన్స్‌పార్మర్ల చోరీ దుండగులు నీళ్లు చల్లారు. ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్, ఆయిల్ ఎత్తుకెళ్లడంతో కరెంటు లేక పొలాలు ఎండిపోయే పరిస్థితి తయారైంది. కాకతీయ కాలువ వెంబడి ఏడు ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. అనంతరం వాటిలోని కాపర్, విలువైన ఆయిల్‌ను చోరీ చేశారు. దీంతో రెండు రోజుల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు 6, 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఒకటి ఎత్తుకెళ్లారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా సుమారుగా 60 ఎకరాల్లో వరి పంటకు నీరందుతోంది. ప్రస్తుతం వరి పంట విత్తు పోసుకునే చివరి దశలో ఉంది. మరోవారం రోజులు నీరు అందితే పంట విత్తు పూర్తిగా ముదిరి పంట చేతికందుతుంది. కాని ప్రస్తుతం విద్యుత్ సరఫరా లేకపోవడంతో నీటి సరఫరా జరిగే అవకాశం లేదు. ఎత్తుకెళ్లిన ట్రాన్స్‌ఫార్మర్లపై ఎఫ్ఐఆర్ నమోదైన తర్వాత వాటి ఆధారంగా ట్రాన్స్‌కో ఉన్నత అధికారులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు చేస్తారు.

ఇదంతా రైతులు దగ్గరుండి సొంత ఖర్చులతో ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను డివిజన్ కార్యాలయానికి తీసుకెళ్లి, అధికారుల చుట్టు ప్రదక్షిణలు చేస్తే తప్ప ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యే అవకాశం లేదు. అంతలోపు చేతికందాల్సిన వరి పంట ఎండిపోయి బూడిద పాలయ్యే ప్రమాదం ఉంది. పాలకులు ఉన్నతాధికారులు స్పందించి వెంటనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేయాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

ట్రాన్స్‌ఫార్మర్లు దుండగులు ఎత్తుకెళ్లడంలో ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంపై రైతులు మండి పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లపై ఎలాంటి నిఘా ఏర్పాటుకు సూచనలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా లైన్‌మెన్‌లు స్థానికంగా ఉండకపోవడం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. గ్రామాల్లో లైన్‌మెన్‌లు స్థానికంగా ఉండకుండా, గ్రామానికి చెందిన మెకానిక్‌పై ఆధారపడి పనులు చేపిస్తున్నారు. దీంతో ఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తుకెళ్లే ప్రమాదం ఉందో గుర్తించడంలో విఫలమవుతున్నారు. ఉన్నత అధికారులు స్పందించి ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌కు ఇనుప చువ్వలతో భద్రత ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

త్వరలోనే మంజూరు చేస్తాం

దుండగులు ఎత్తుకెళ్లిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను వారం, పది రోజుల్లో మంజూరు చేస్తాం. రైతులు గస్తీ తిరగాలని ఇదివరకే సూచించాం. భవిష్యత్తులో ఇలాంటి జరగకుండ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటాం. – మహ్మద్ అంజాత్ పాషా, ట్రాన్స్‌కో ఏఈ, మెండోరా

పెట్రోల్‌లో నీళ్లు..

- ఆందోళనకు దిగిన వాహనదారులు
- రామారెడ్డి హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో ఘటన

రామారెడ్డి(ఎల్లారెడ్డి) : పెట్రోల్‌లో నీళ్లు రావడంతో వాహనదారులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన రామారెడ్డి మండల కేంద్రం హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో మంగళవారం జరిగింది. ఓ వాహనదారుడు వాటర్ బాటిల్‌లో లీటర్ పెట్రోల్ కోసం రాగా బంక్ సిబ్బంది బాటిల్‌లో పెట్రోల్ నింపారు. అయితే బాటిల్ 15శాతానికి పైగా నీళ్లు కనిపించడంతో వాహనదారుడు అవాక్కయ్యాడు. మరికొంత మంది వాహనదారులు పెట్రోల్‌లో నీళ్లను చూసి ఆందోళనకు దిగారు. గతంలోనూ ఈ పెట్రోల్ బంక్‌లో నీళ్లు వచ్చాయని, అయినా వీరి మారట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై జిల్లా పౌర సరఫరాల అధికారి పద్మను ‘సాక్షి’ వివరణ కోరగా పెట్రోల్ బంక్ యజమానుల నిర్లక్ష్యం నిర్వహణ లోపం కారణంగానే ఇలా జరుగుతోందని సదరు పెట్రోల్‌బంక్‌లో తనిఖీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.



పెట్రోల్‌లో వచ్చిన నీళ్లు

కొనసాగుతున్న బోదకాలు గుర్తింపు సర్వే

- 59 పాఠశాలలో 1,692 మంది విద్యార్థులకు పరీక్షలు
- నలుగురికి బోదకాలు వచ్చే అవకాశాలున్నట్లు నిర్ధారణ

నిజామాబాద్ సిటీ : కేంద్ర ప్రభుత్వం బోదకాలు గుర్తించేందుకు మూడవ విడత సర్వే(ట్రాన్స్‌మిషన్ అసెస్‌మెంట్ సర్వే) జిల్లాలో కొనసాగుతోంది. గత నెల మార్చి 31 నుంచి మొదలుకాగా ఈనెల 7వ తేదీ వరకు కొనసాగనుంది. జిల్లావ్యాప్తంగా 49 పాఠశాలలో ఈ సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. ఎక్కడైనా సర్వేకు ఇబ్బంది తలెత్తితే అదనంగా మరో 10 పాఠశాలలను ముందస్తుగా ఎంపిక చేసి ఉంచారు. మొత్తం 1692 మంది విద్యార్థులకు రక్త పరీక్షల ద్వారా బోదకాలు ఉందా లేదా అనేది గుర్తించనున్నారు. దీనికిగాను జిల్లావ్యాప్తంగా మొత్తం 10 వైద్య బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో సూపర్‌వైజర్, ల్యాబ్ టెక్నిషియన్, ఏఎన్‌ఎం, ఇద్దరు ఆశ కార్యకర్తలను నియమిచారు. బోదకాలు పరీక్షలు చేసేందుకు వీరిందరూ గత నెల మార్చి 24న జిల్లా కేంద్రంలో శిక్షణ పొందారు. ఈ బృందం క్షేత్రస్థాయిలో రక్త పరీక్షలు చేసి 10 నిమిషాలోనే విద్యార్థులలో బోదకాలు క్రిమి ఉందా లేదా అనేది గుర్తించి బోదకాలు క్రిమి ఉంటే వారికి వైద్యం, మందులు పంపిణీ చేస్తున్నారు. ఎంపిక చేసిన పాఠశాలలో ఆరు, ఏడేళ్ల పిల్లలకు మాత్రమే పరీక్షలు చేస్తున్నారు. మంగళవారం నాటికి జిల్లాలో 30 పాఠశాలలో సుమారు 1200 మంది విద్యార్థులకు పరీక్షలు పూర్తి చేశారు. ఈ పరీక్షలో నలుగురు విద్యార్థులకు బోదకాలు వచ్చే అవకాశాలు ఉన్నట్లుగా వైద్యులు గుర్తించారు. వారికి బోదకాలు నివారణకు చికిత్స అందించనున్నారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారం నిత్యం జిల్లాలో ఈ సర్వే కొనసాగుతున్న తీరును పరిశీలిస్తున్నారు.



నగరంలో బోదకాలు సర్వేను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం

టీయూలో పలువురి పదవీకాలం పొడగింపు

తెయూ(డిచ్‌పల్లి) : తెయూలోని వివిధ విభాగాల్లో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల పదవీకాలాన్ని వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ రవీందర్ ఆదేశాల మేరకు పొడిగించారు. ఏడాది పాటు వీరి పదవీకాలాన్ని పెంచినట్లు రిజిస్ట్రార్ ఆచార్య విద్యావర్ధిని ఉత్తర్వులు జారీచేశారు. పదవీకాలం పొడిగించిన వారిలో ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొ భ్రమరాంబిక, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్, డైరెక్టర్, మైనార్టీ సెల్‌గా పనిచేస్తున్న అసోసియేట్ ప్రొ గుల్ ఈరానా, ఉమెన్ సెల్‌గా పనిచేస్తున్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ప్రొ అపర్ణ, గ్రీవెన్స్ సెల్‌గా పనిచేస్తున్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డా రాజేశ్వరి ఉన్నారు.

టీయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం

తెయూలో లా విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్నరాణిని డైరెక్టర్ లీగల్ సెల్‌గా, అసిస్టెంట్ ప్రొఫెసర్ స్రవంతిని డైరెక్టర్, లీగల్ ఎయిడ్ క్లీనిక్‌గా వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ రవీందర్ నియమించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విద్యావర్ధిని ఉత్తర్వులు జారీచేశారు.

ఓటర్ కార్డులో తప్పులు సవరించాలి



నిజామాబాద్ నాగారం : నగరంలోని ఓటర్‌కార్డుల్లో తప్పులను సవరించాలని, అలాగే డబుల్, త్రిబుల్ పేర్లు ఉంటే వెంటనే సరిచేయాలని చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారి రవికిరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం బురుడుగల్లిలో ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టారు. ఎక్కడైనా రెండు, మూడు సార్లు ఫొటో, పేరు వస్తే ఒక దగ్గర ఉంచి మిగితా చోట్ల తీసివేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఆరు వేలు, నగరంలో 1500 ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఓటర్ లిస్ట్‌లను పరిశీలిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ చిత్రమిశ్రా తదితరులున్నారు.

పేపర్ లీకేజీ దోషులను తప్పిస్తున్నారు



కామారెడ్డిలో యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నినాదాలు చేస్తున్న కార్యకర్తలు

కామారెడ్డి టౌన్ : రాష్ట్రంలో ప్రశ్నపత్రాలు పరీక్ష పేపర్ లీకేజీల దోషులను తప్పించే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చందు, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఐరేని సందీప్ ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కోర్టు రోడ్డులో నిరుద్యోగులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10 రోజులుగా ఎన్‌ఎస్‌యూఐ, కాంగ్రెస్‌ల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతుంటే ప్రభుత్వం దోషులను తప్పించే ప్రయత్నం చేయడమే కాకుండా, తమపై అక్రమ కేసులను బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ప్రశ్నాపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని, మంత్రి వర్గం నుంచి మంత్రి కేటీఆర్‌ను భర్తరఫ్ చేయాలని, కమిషన్ పాలక మండలిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీపై సాక్షాదారాలతో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డికి ఈడీ నోటీసులు పంపిందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, ప్రవీణ్, బూక్యా రాజు, తుడుం జీవన్, సోఫియాన్, శ్రీధర్, నందు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మకు ఉరివేసి..



కామారెడ్డి టౌన్ : రాష్ట్రంలో వరుసగా పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలను నిరసిస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం కొత్త బస్టాండ్ ఎదుట ప్రభుత్వ దిష్టిబొమ్మకు ఉరివేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి చరణ్ మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ, గ్రూప్స్ పరీక్షా పత్రాలతో పాటు ప్రస్తుతం పదోతరగతి పరీక్షల ప్రశ్నపత్రాలు లీకేజీలు పాల్పడం ప్రభుత్వం నిర్లక్ష్యమేనన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సంబంధిత మంత్రులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇందూర్ విభాగ్ వసతి గృహాల కన్వీనర్ పోతరాజు లక్ష్మణ్, జోనల్ ఇన్‌చార్జి సాయి చరణ్, నాయకులు ఖలీల్, రాజు, సాయి, మహేశ్ పాల్గొన్నారు.

ఉద్యానక్షేత్రంలో మామిడి వేలం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద ఉద్యానక్షేత్రంలో మామిడితోట కాతకు బుధవారం అధికారులు వేలంపాట నిర్వహించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలంపాట జరిపారు. కాగా వేలంపాటలో 11మంది వ్యాపారులు పాల్గొనగా ఎల్లారెడ్డి మండలం మాచాపూర్‌కు చెందిన దాసరి పోచయ్య అత్యధికంగా రూ.1,79,000 పాడి కాతను దక్కించుకున్నాడు. వేలంపాటలో మాల్తుమ్మెద ఉద్యానక్షేత్ర అధికారి రామకృష్ణ తదితరులున్నారు.

జిల్లాలో ఆయిల్‌పాం సాగు లక్ష్యం పూర్తి

జిల్లాలో 2022-23కు సంబంధించి ఆయిల్ పాం సాగు లక్ష్యాన్ని పూర్తి చేశామని జిల్లా ఉద్యానశాఖ అధికారి విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద ఉద్యానక్షేత్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. జిల్లాలో 2022-23కుగానూ 800 ఎకరాల్లో ఆయిల్ పాం సాగుచేయాలని లక్ష్యంగా నిర్ణయించారని, ఈ మేరకు 250 మంది రైతుల పొలాలలో 800 ఎకరాల్లో ఆయిల్ పాం సాగు చేయించామన్నారు. ప్రస్తుతం ఆయిల పాం మొక్కలకు నల్లకొమ్మ పురుగు, రైనో సారస్ బిటిల్ తెగుళ్లు సోకుతున్నాయన్నారు. వీటి నివారణ కోసం రైతులకు తగు సూచనలు చేశామన్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.లక్షా70వేల బడ్జెట్‌ను కేటాయించిందన్నారు.



మాల్తుమ్మెద ఉద్యానక్షేత్రంలో మామిడి కాతకు వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

పల్లెపల్లెకు ఓబీసీ.. ఇంటింటికీ బీజేపీ

- ఈనెల 6 నుంచి 14 వరకు..
- నిజామాబాద్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య

ఖలీల్‌వాడి : ఈనెల 6 నుంచి 14వ తేదీ వరకు పల్లెపల్లెకు ఓబీసీ ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య తెలిపారు. మంగళవారం బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ పీఎం నరేంద్ర మోదీ బీసీలకు చేకూర్చిన ప్రయోజనాలు ప్రజలకు వివరించడానికి ఓబీసీ మోర్చా అధ్వర్యంలో కార్యక్రమం చేపట్టిందన్నారు. తెలంగాణకు చెందిన డాక్టర్ లక్ష్మణ్‌ను కేంద్ర ఓబీసీ అధ్యక్షుడిగా చేయడమే కాకుండా బీసీ వర్గానికి చెందిన బండి సంజయ్‌ను రాష్ట్ర అధ్యక్షున్ని చేసినట్లు చెప్పారు. బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసి దానికి చట్టబద్ధత కలిప్పించామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 33 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను దాదాపు 10 శాతం తగ్గించి, 23 శాతంకు కుదించారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. రైతులకు రుణామాఫీ అమలు చేయాలేదన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వచ్చే వరకు ప్రతి కార్యకర్త ముందు ఉండి పని చేయాలన్నారు. ఓబీసి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందన్ దివాకర్, ఓబీసీ మోర్చా జిల్లా ఇంఛార్జి గరిపే శ్రీనివాస్, యామాద్రి భాస్కర్, పొతన్ కర్ లక్ష్మి నారాయణ, స్వామి యాదవ్, శిలా శ్రీనివాస్, డమాంకర్ శ్రీనివాస్, కొడూరు నాగరాజు, నర్సింగ్ ముదిరాజ్, ఇప్పాకాయల కిషోర్, గిరిబాబు, రాజన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బస్వా లక్ష్మీనర్సయ్య

పట్టాపాస్ పుస్తకాలతో ధర్నా



సిరికొండ : మండలంలోని గడ్కోల్ గ్రామంలో పట్టాదారులు పాత పట్టా పాసు పుస్తకాలతో మంగళవారం ఆందోళన చేశారు. గ్రామ రెవెన్యూ శివారులో సర్వే నం. 100, 102లో 2005లో అప్పటి ప్రభుత్వం 160 మంది పేదలకు ఎకరం చొప్పున పట్టాలు ఇచ్చింది. ప్రస్తుతం వాటిని ధరణిలో నమోదు చేయకపోవడంతో పట్టాదారులు ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నామన్నారు.

భిక్కనూరులో చైన్ స్నాచింగ్

భిక్కనూరు : మండల కేంద్రంలో శ్రీ సిద్దరామేశ్వర స్వామి ఆలయ కమాన్ సమీపంలో మంగళవారం సాయంత్రం చైన్‌స్నాచింగ్ జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మెదక్ జిల్లా వడియారం గ్రామానికి చెందిన కొనింటి మల్లమ్మ తన కుటుంబీకులతో కలిసి భిక్కనూరు ఎల్లమ్మ ఆలయం వద్ద వారి బంధువులు పండగ చేయడంతో ఉదయం వచ్చింది. పండగ అనంతరం ఆమె తిరిగి వడియారం వెళ్లేందుకు బస్సు ఎక్కేందుకు ఎల్లమ్మ ఆలయం వద్ద భర్త నర్సయ్యతో కలిసి నడుచుకుంటూ వెళ్తోంది. శ్రీ సిద్దరామేశ్వర కమాన్ వద్దకు వస్తుండగా అకస్మాత్తుగా బైక్‌పై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వెనక నుంచి వచ్చి మల్లమ్మ మెడలో బంగారు పుస్తెల తాడును లాగారు. దీంతో ఆమె కిందపడిపోగా వారు భార్యభర్తలిద్దరికీ కత్తి చూపించి మల్లమ్మ మెడలో చైన్‌ను తెంపుకుని పరారయ్యారు. విషయం తెలుసుకున్న భిక్కనూరు సీఐ తిరుపతయ్య సంఘటనాస్థలానికి చేరుకుని బాధితుల నుంచి వివరాలు సేకరించి దుండగుల కోసం గాలించారు.



బాధితురాలు మల్లమ్మ

క్రైం కార్నర్

కాలువలో పడి ఒకరి ఆత్మహత్య

రెంజల్(బోధన్): రెంజల్ మండల కేంద్రానికి చెందిన మల్లెపూల నడ్పి గంగాధర్(54) అనే వ్యక్తి కాలువలో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం గ్రామ శివారులోని సాగర్ కాలువలో గుర్తు తెలియని మృతదేహం నీట మునిగి ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఇంచార్జి ఎస్సై నారాయణసింగ్ సిబ్బందితో చేరుకుని మృతదేహాన్ని కాలువ నుండి బయటకు తీయించారు. కాలువ ఒడ్డును సైకిల్‌ను పార్కింగ్ చేసి బట్టలు, సెల్‌ఫోన్‌ను పక్కన పెట్టి కాలువపై ఉన్న చిన్న సిమెంట్ పోల్‌కు చేతి రుమాలుతో రెండు కాళ్లకు కట్టుకుని తాడు సాయంతో కాలువలో దిగి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. గంట క్రితమే ఇంటి నుండి వెళ్లి కాలువలో శవమై తేలడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు కుటుంబీలకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎవరిపై అనుమానంలేదని కుటుంబీకులు వివరించారు. భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బోధన్‌లోని జిల్లా ఆస్పత్రికి తరలించారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

కనువిందు చేస్తున్న హైసింత్ పూలు



పాంగ్రా వాగులో పెరిగిన హైసింత్ పూలు



పువ్వు రెమ్మపై నెమలీక డిజైన్

నగరంలోని పాంగ్రా వాగులో గుర్రండెక్కకు పెరిగిన హైసింత్ పూలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. వాగులో నీరు అడుగంటిపోవడంతో గుర్రపుడెక్క మొక్కలు మొత్తం వాగునంతా ఆక్రమించాయి. వాటికి పూసిన నీలి రంగు పువ్వులు పూలవనాన్ని తలపిస్తున్నాయి. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

భిక్కనూరు : మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు భిక్కనూరు ఎస్సై ఆనంద్‌గౌడ్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన బందెల బాబు (42) లావణ్యలు భార్యభర్తలు. వీరికి కుమార్తె నికిత, కుమారుడు గణేశ్ ఉన్నారు. బాబు ముంబయిలో నివసిస్తాడు. ఇటీవల ముంబాయి నుంచి జంగంపల్లి గ్రామానికి వచ్చాడు. సోమవారం రాత్రి బందెల బాబు ఆయన భార్య లావణ్యతో ఎల్లారెడ్డి నుంచి వచ్చిన స్వామి అనే అనుమానాస్పద వ్యక్తి గొడవపడుతుండగా కుటుంబీకులు, స్థానికులు వెళ్లి సముదాయించారు. ఉదయం బాబు మృతి చెందాడని భార్య లావణ్య కాలనీవాసులకు తెలిపింది. దీంతో కాలనీవాసులు ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. పోలీసులు మృతుని భార్య లావణ్యను ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన స్వామిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



మృతి చెందిన బాబు

చెరువులో పడి ఒకరు..

నస్రుల్లాబాద్(బీర్కూర్) : బీర్కూర్ మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన ఎర్ర పీరయ్య(37) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం సాయంత్రం చెరువులో నీరు పారపెట్టి వస్తానని వెళ్లి ఎంతకు రాకపోవడంతో మంగళవారం భార్య సావిత్రి కుంటుంబసభ్యులతో కలిసి పొలం పక్కనే ఉన్న చెరువు వద్ద చూడగా చెరువులో మృతదేహం కనిపించడంతో గ్రామస్తులకు సమాచారం అందించారు. కాలకృత్యాలను తీర్చుకునేందుకు చెరువులోకి దిగగా ప్రమాదవశాత్తు పడిపోయి ఈతరాక ప్రాణాలు కోల్పోయినట్లు అనుమానిస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు. భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆత్మహత్యకు కారణమైన వ్యక్తి అరెస్టు

మాక్లూర్ : మండలంలోని మాణిక్‌భండార్‌కు చెందిన కెతావత్ రాజేశ్వరి (19) ఆత్మహత్యకు కారకుడైన అదే మండలానికి చెందిన అభిలాష్‌ను పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ పేర్కొన్నారు. ఒకే తండాకు చెందిన రాజేశ్వరి, అభిలాష్ నాలుగేళ్లుగా ప్రేమించుకుని విడిపోయారు. ఐనప్పటికీ అభిలాష్ తరుచూ ఫోన్‌చేస్తూ వేధించటంతో తట్టుకోలేక రాజేశ్వరి మార్చి 23న రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. తొమ్మిదిరోజుల పాటు చికిత్స పొంది ఈనెల 1న మృతి చెందిన విషయం విదితమే. తల్లి అనూష ఫిర్యాదు మేరకు మాక్లూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అప్పటినుంచి తప్పించుకుని తిరుగుతున్న అభిలాష్‌ను మంగళవారం మాణిక్‌భండార్ చౌరస్తా వద్ద పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ పేర్కొన్నారు.